# అందరూ బ్రతకాలి

[ఆంధ్రభూమి వారపత్రిక]

"నువ్వు వ్యభిచారం చేశావా లేదా?" విసుగ్గా
అడిగేరు జడ్జిగారు.

"సెయ్యలేదంటేమటుకు ఒగ్గేస్తారేటండీ?
చేసేననే రాసుకోండి!"

"వ్యభిచారం నేరం, ఇంకెప్పుడూ చెయ్యకు!"

"మరి, కడుపు గడవటం ఎలాగండి? దానిమీదే
బతుకుతున్నానండి!"

అందరూ బ్రతకాలి.

అవును. కానీ, ఎలా? — —

కోర్టు హాలు బయట తీవ్రంగా వుంది.

కోర్టు హాలు లోపల జడ్జీగారు చికాకుగా వున్నారు.

కేసులు తొందరగా తెమలటం లేదని ధుమధుమ లాడుతున్నారు.

'తొందరగా పిలు...' అంటూ 'అమీనా' వంకకు తిరిగి కసురుకున్నారు.

అమీనా కోర్టుహాలు ద్వారంనుండి తల బయటకు పెట్టి "పువ్వుల నారాయణమ్మ— పువ్వుల నారాయణమ్మ!" అంటూ బిగ్గరగా కేకపెట్టి, తన పని పూర్తిచేసుకుని లోనికి వచ్చేశాడు.

అమీనా వెనుకే పువ్వుల నారాయణమ్మ కోర్టు హాలులోకి వచ్చింది. సన్మానం అందుకోబోయే మనిషి వేదిక మీదకు ఎక్కినట్లు బోనులోకి ఎక్కి నిబ్బరంగా నిలబడింది.

తర్వాత అమీను వచ్చి భగవద్గీత ఆమె చేతిలో వుంచి ప్రమాణ వాక్యాలు చెప్పించేడు.

జడ్జిగారికి దగ్గరలో నిలబడ్డ ఇనస్పెక్టర్ సగం ఇంగ్లీషులోనూ సగం తెలుగులోనూ ఆయనతో కేసు గురించి చెప్పేడు.

"పువ్వుల నారాయణమ్మవి నువ్వేనా?" జడ్జిగారు కళ్ళజోడు లోనుండి తీవ్రంగా చూస్తూ అడిగేరు.

"ఔనండి!"

"నిన్ను ఎందుకు అరెస్టు చేశారు?"

"తనకి తెల్దేటండి...."

"అడిగినదానికి సరిగ్గా సమాధానం చెప్పు" కసిరేరు.

"అందుకేనండి...."

"అందుకే అంటే?...." జడ్జిగారు మరింత స్వరం పెంచేరు ఈసారి.

"ముండ కేసు పెట్టేరండి పోలీసోళ్ళు...."

"నువ్వు వ్యభిచారం చేశావా?"

"సెయ్యలేదంటే మటుకు ఒగ్గేస్తారేటండి?...."

"చేశావా? లేదా? సరిగ్గా సమాధానం చెప్పు-"

"మా యాపారమే అదిగదండి.... దానిమీదే బతుకుతున్నదాన్ని సెయ్యనేదని ఎలా సెప్తానండి?"

"అయితే, చేసేవన్నమాట!"

"ఆయేళ సెయ్యలేదండి...."

"మరి, పోలీసులు ఎందుకు పట్టుకున్నారు?"

"ఆయేళ కేసులు ఆళ్ళకేం దొరకలేదండి.... బుధోరం కదండి. మాకు మామూలే! కిందటి బుధోరం రత్తమ్మ కంపెనీ మీద రైడింగులు చేసినారండి.... ఈ బుధోరం మా కంపెనీమీద వచ్చారండి— అదండి సంకతి" వివరించింది పువ్వుల నారాయణమ్మ.

"నువ్వు ఆ రోజు వ్యభిచారం చేశావా, లేదా?" మరింత విసుగ్గా మారింది జడ్జిగారి గొంతు.

"సెయ్యనేదంటే మటుకు ఒగ్గేస్తారేటండి? చేసేననే రాసుకోండి!"

"వ్యభిచారం చేయటం నేరం. ఆ సంగతి తెలుసా?"

"తెలుసండి! మరి కడుపు గడవటం ఎలాగండి? దానిమీదే బతుకుతున్నానండి...."

"ఇంకెప్పుడూ చెయ్యకు."

"సూస్తారినెండి.... దానిమీదే బతుకుతున్న దాన్ని.... ఒగ్గేమంటే ఎలాగ?.... మావూ బతకాలిగదా! జుల్మానా మాత్రం ఎయ్యకండి బాబూ! జైలు ఏసెయ్యండి.... మంచికూడు ఎట్టేనాగ మాత్రం రాయించండి మారాజు...." అంటూ రెండు చేతులూ ఎత్తి జోడించి జడ్జిగారికి నమస్కారం చేసింది నారాయణమ్మ.

"సర్లే! వెళ్లు. పదిహేను రోజులు వేస్తున్నాను. నెక్స్ట్.... తర్వాత కేసు పిలవండి."

"కావిలిపాటి ఆదినారాయణా.... కావిలిపాటి ఆదినారాయణా!" అమీనా గొంతు హాలు బయట!

ఒక నిమిషం తర్వాత దేవుని ఎదుట ప్రమాణమయిపోయింది.

"కావలిపాటి ఆదినారాయణ నువ్వేనా?"

"అవునండి!"

"అశ్లీల సాహిత్యం షాపులో పెట్టుకుని అమ్ముతున్నావనీ, అద్దెకు ఇస్తున్నావనీ ప్రాసిక్యూషన్‌వారు అంటున్నారు....నిజమేనా?"

"అమ్మేనండి!"

"బూతు పుస్తకాలు అమ్మటం నేరమని నీకు తెలీదా?"

"తెలుసుకానీ ఇందులో నా నేరం లేదండి! ఆ పుస్తకాలు ప్రచురించేవాళ్ళని అరెస్టు చేయాలిగానీ- అర్ధకీ, పావలాకీ కమీషన్‌కోసం అమ్ముకుంటున్నవాళ్ళం.... మమ్మల్ని పట్టుకుంటే ఎలాగండి.... మేం వానిమీదే బతుకుతున్నాం సార్!"

"రెండువందల రూపాయలు జరిమానా కట్టు."

"అన్యాయం సార్"

"అయితే మూడువందలు కట్టు.... నెక్స్ట్— తొందరగా పిలవండి"

"వీసం దాసయ్య.... వీసం దాసయ్య!" అమీనా గొంతు మళ్ళీ కోర్టు వరండాలో ప్రతిధ్వనించింది.

"ఈ కేసు ఏమిటి?" ఇనస్పెక్టర్ వంక చూసేడు జడ్జిగారు.

"గుడిలోన కొండ దగ్గర సారా ట్యూబులు దాటించేస్తూ వుంటే పట్టుకున్నామండి. దొంగసారా కేసు!" ఇన్‌స్పెక్టర్ వివరించేడు.

వీసం దాసయ్య బోనులోకి ఎక్కి ప్రమాణం చేశాడు.

"వీసం దాసయ్యవి నువ్వేనా?"

"అవ్!"

"దొంగసారా ట్యూబుల్లో నింపి పట్టుకెళ్ళటం నిజమేనా?"

"అవ్!"

"సారా అక్రమంగా రవాణా చెయ్యటం నేరమని తెలుసా?"

"అవ్!"

"నీ నేరం ఒప్పుకుంటున్నావా?"

"దానిమీదే బతుకుతున్నవోణ్ణండి. ఏదో యాపారం మీద బతకాలి గదండీ!— అందుకే చేసేనండి"

"అయితే అయిదొందలు జరిమానా కట్టు మూడు నెలలు జైలుకు వెళ్ళు...."

"మరో అయిదొందలు కావాలంటే ఏసెయ్యండి బాబులూ.... జైలుకుమాత్రం పంపకండి.... పోలీసోళ్ళు కాల్చుకు తినేస్తారు— బయట నా యాపారం అంతా ఆగిపోద్ది.... నామీద ఆధారపడి పదిమంది బతుకు తున్నారు—" దాసయ్య గోలపెట్టటం ఆరంభించేడు.

"ఉస్! అరవకు....వీణ్ణి తీసుకెళ్ళండి. ఊ! తర్వాత. యింకా ఎన్ని కేసులున్నాయి?" చేతివాచీ వంక విసుగ్గా చూసుకుంటూ అడిగేరు జడ్జీగారు.

"ఇదే ఆఖరుదండి" అన్నాడు బెంచీ గుమాస్తా.

"చెక్కా నర్సిములూ .... చెక్కా నర్సిములూ ...." అమీనా గొంతెత్తి పిలిచేడు.

"దేవుని ఎదుట ప్రమాణం చేసి అంతా నిజమే చెబుతాను అబద్ధం చెప్పను!" ప్రమాణం పూర్తయింది."

"చెక్కా నర్సిములు అంటే నువ్వేనా ?"

"నేనేనండి."

"నువ్వు బ్లూ ఫిలిమ్ ప్రదర్శిస్తూ వుంటే అరెస్టు చేశామంటున్నారు పోలీసులు. నిజమేనా?"

"అది బ్లూ ఫిలిం కాదండీ. మామూలు తెలుగు సినిమా కేసెట్టండి. అందులో ఆఖరికి ఒక రీలు ఎలా వచ్చేసిందో వచ్చెసిందండి."

"ఏమిటి వచ్చేసింది?"

"అదేనండి. బ్లూ ఫిలిం కాదండి. మళయాళం సినిమా రీలండి. దాన్ని చూసి పోలీసులు బ్లూ ఫిలిం అనుకున్నారండి."

"ఆ కేసెట్‌లో అసభ్యకరమైన దృశ్యాలు, అశ్లీల సన్నివేశాలు వున్నాయా? లేవా ?"

"యెందుకుండవండీ? మళయాళం సినిమా రీలు కదా, అసభ్య దృశ్యాలు లేకుండా ఎలా వుంటాయండీ?"

"మరి అలాటి కేసెట్ వేయటం నేరమని తెలీదా ?"

"ఎందుకు తెలీదండీ ! తెలుసండి....కానీ అదే సినిమా హాలులో వేస్తే పట్టుకోవటంలేదండీ!"

"నువ్వు నేరం ఒప్పుకుంటున్నావా? లేదా ?"

"నాదెలా నేరం అవుతుందండీ? సినిమా తీసిన వాళ్ళది నేరం .... దానికి సెన్సారు సర్టిఫికేటు ఇచ్చిన వాళ్ళది నేరం.... దాన్ని డిస్ట్రిబ్యూట్ చేస్తున్న వాళ్ళది నేరం....దాన్ని కేసెట్‌లో చూపిస్తున్నంత మాత్రానికి నేరం అంటే ఎలాసార్?"

"అశ్లీల దృశ్యాలు వీడియో ద్వారా చూపించటం చట్టరీత్యా నేరం. రెండువేలు జరిమానా, ఆరునెలలు జైలుశిక్ష వేస్తున్నాను."

"అయ్యబాబోయ్! ఘోరం సార్! రోజంతా అయిదు ఆటలువేస్తే వి.సి.ఆర్. అద్దె డబ్బులు పోగా, రూంరెంటు పోగా మాకు మిగిలేది యాభయి రూపాయలు కూడా వుండదు. మరి మేం బతకటం ఎలాసార్?" గోలపెట్టేడు సర్సిములు.

"మొదటిసారి కాబట్టి ఇంతటితో వదిలేస్తున్నాను. మళ్ళీ యిలాటి

పనులు చెయ్యాకు" జడ్జీగారు తమ ఎదుటనున్న ఫైలుమూసి కుర్చీలోంచి లేచి నిలబడ్డాడు.

"అమ్మయ్య! ఈ వేళ్టికి పని పూర్తయ్యింది. ఈ వేళ్టకి పాపాలు వినటం ఆఖరయింది. ఈ వేళ్టి నరకయాతన ముగిసింది" అనుకుంటూ దీర్ఘంగా నిట్టూర్చేరు.

అందరూ బతకాలి ....

బతకటం అందరికీ జన్మహక్కు ....

బతకటం కోసం నేరాలు చేస్తున్నారు....

నేరాలు ఎందుకు చేస్తున్నావురా అంటే బతకటం కోసం అని ఖచ్చితంగా చెప్పేస్తున్నారు....

బతకవద్దని ఎలా చెప్పటం ?

నేరాలు చేయమని మాత్రం ఎలా చెప్పటం ?"

ఆలోచనలతో సతమతమవుతూ సీటులో నుండి లేచారు జడ్జీగారు.

"డ్రైవరును కారు బయటకు తియ్యమను" అని అమీనాతో చెప్పి గబగబా తన 'ఛాంబరు'వైపు కదిలివెళ్లేరు.

ఛాంబర్‌లో వాష్ బేసిన్ దగ్గరకు వెళ్లి ముఖం కడుక్కున్నాడు. నేప్‌కిన్‌తో ఒత్తుకుని దువ్వెనతో తలసరి చేసుకుని, అద్దంలో చూసుకుని బయటకు వచ్చేరు.

గబగబా అడుగులు వేసుకుంటూ బయట ఆవరణలోనికి కదిలి వచ్చి, కారు వెనుక సీట్లో కూలబడ్డారు.

"డ్రైవర్! తొందరగా పోనీయ్! అబ్బాయి ఈవేళ స్టేట్స్‌నుండి వస్తున్నాడు. ఈపాటికి ఇల్లుచేరి వుంటాడు" అన్నారు.

"అలాగే సాబ్!" అంటూ డ్రైవర్ ఇంజను స్టార్టు చేశాడు.

జడ్జీగారి మస్తిష్కం నిండా మళ్లీ ఆలోచనలు ముసురుకోవటం ఆరంభించేయి!

మధ్యాహ్నం తీర్పు చెప్పిన కేసులు గుర్తుకొచ్చేయి.

పువ్వుల నారాయణమ్మ పువ్వులమ్ముకోటం లేదు. కనీసం కట్టె అయినా అమ్మటంలేదు. ఒళ్లమ్ముకుంటోంది ....

ఎందుకంటే బతకటాని కంటోంది!

కావిలిపాటి ఆదినారాయణ బూతు పుస్తకాలు అమ్ముతున్నాడు! యువతరాన్ని పెడత్రోవ పట్టిస్తున్నాడు. ఎందుకంటే —

బ్రతకటానికి మార్గం లేదంటున్నాడు.

వీసం డానయ్య అక్రమంగా వంట సారా రవాణా చేస్తున్నాడు.

అది తప్ప బ్రతికేమార్గం వేరే కనబడదంటున్నాడు.

అది నేరమంటే బ్రతకటం ఎలాగ? అని యెదురు ప్రశ్న వేస్తున్నాడు.

చెక్కా- నర్సిములు ఎంచక్కా- బ్లూ ఫిల్ములు వేస్తున్నాడు.

అదీ బతకటం కోసమే నంటున్నాడు.

ఈ చట్టవిరుద్ధమైన పనులు చేయకపోతే వాళ్లు బ్రతకలేరా? ఏమో! బతకలేరేమో!

వాళ్ళకి వేరే ఏ ఆధారమూ లేదేమో!

కారు ఆగిన శబ్దానికి ఆలోచనలనుండి వచ్చిపడ్డారు జడ్జీగారు.

అప్పుడే ఇల్లు వచ్చేసింది.

పోర్టికోలో ఆగివుంది కారు.

డోర్ తెరుచుకుని గబగబా దిగిలోనికి నడిచేరు.

"తొందరగా వచ్చేస్తానన్నారు. ఇంత ఆలస్యం చేశారేం? .... అప్పుడే అబ్బాయి వచ్చి గంటదాటిపోయింది. కారు కోసం చూసి చూసి విసుగెత్తి టాక్సీమీద వచ్చేశాడు" అంటూ శ్రీమతి ఎదురొచ్చింది.

"కేసులు తెమిలేయికావు" అంటూ లోనికి నడిచేరు.

"ఇవిగో చూడండి....అబ్బాయి ఎన్ని వస్తువులు తెచ్చాడో అమె

రికానుండి" అంటూ గదిలో మంచంమీద, కింద సర్దిన వస్తువులు చూపించింది.

వాటివంక చూస్తూ రెండు క్షణాలు గది గుమ్మం దగ్గరే నిలబడిపోయేరు.

"అబ్బాయి స్నానానికి వెళ్ళేడు. మీకు కాఫీ తీసుకువస్తాను" అంటూ వంటింటివైపు కదిలిపోయింది. జడ్జీగారు మెల్లగా అడుగులు వేసుకుంటూ గదిలోకి కదిలివెళ్ళేరు. తర్వాత అక్కడి వస్తువులన్నీ పరిశీలనగా చూసేరు. ఒక వి.సి. ఆర్. కలర్ టి. వి., బాక్సునిండా కాసెట్లు. వాటిలో కొన్నిటిమీద నీలం గీతలు. రెండు బంగారు గొలుసులు. ఖరీదైన టేప్ రికార్డర్, కెమెరా, బోలెడు కాసెట్లు. నేలమీద ఒక వారగా పెద్ద వాషింగ్ మెషీన్. ఇవన్నీ చూస్తే మతిపోయినట్లయింది!

జీవిత కాలమంతా ఉద్యోగంచేసి హోదా వెలగబెడుతున్నా మంచి రేడియో, బ్లాక్ అండ్ వైట్ టీ.వి. తప్ప వేరే వస్తువులు ఏవీ కొనటము కుదరలేదు. నానాయాతనలూపడి నడుపుతున్న కారుమీద ఇంకా బాకీ తీరనే లేదు. అలాటిది మూడేళ్ళ ఉద్యోగానికే ఇవన్నీ కొనగలిగేడు కొడుకు. సూట్‌కేసు తెరచి పై భాగంలోని పుస్తకాలు తీసి తిరగేశారు. వాటి నిండా బూతుబొమ్మలు. వివిధ భంగిమలలో రతిక్రీడ జరుపుకుంటున్న బొమ్మలు. విదేశీ వనితల నగ్నరూపాలు!

"ఛీ! అనుకుంటూ పుస్తకాలు లోపల పడేసి సూట్‌కేసు మూయబోయారు.

కానీ ఏదో అడ్డుపడటం వలన మూతపడలేదు!

ఏదో అడ్డుకుంటోందని సర్దబోతే లోపల చేతికి విస్కీ సీసాలు తగిలేయి !

పాముల్ని చూసినట్లు ఉలిక్కిపడ్డారు. సీసాలు సరిగ్గా సర్ది మూత వేశారు.

అంతలోనే "హాయ్ డాడీ! మీరు ఎయిర్‌పోర్ట్‌కి వస్తారనుకున్నాను. రాకపోవటంతో చాలా కోపం వచ్చేసింది మీ మీద" అంటూ తువ్వాలుతో తల ఒత్తుకుంటూ లోనికి వచ్చేడు కిరణ్.

"కేసులు తొందరగా తెమల్లేదురా !" అంటూ కొడుకు వంక చూశారు.

తర్వాత "ఇవేమిట్రా? ఇన్ని వస్తువులు తెచ్చేవ్? బోలెడు ఖర్చు కదా!" అన్నారు.

"అన్నీ మనం వుంచేసుకుంటామా ? కొన్ని అమ్మిపారేస్తాం .... బోలెడంత డబ్బు పలుకుతుంది! అదీకాక, ఇంక స్టేట్స్ వెళ్ళదల్చుకోలేదు. ఇక్కడే సెటిలయిపోతాను. అందుకని కనీస అవసరాలకు ఓ వి.సి.ఆర్, వాషింగ్‌మిషన్ ఇలాంటివన్నీ తెచ్చేను. అలాటి కనీస అవసరాలయినా లేకపోతే బ్రతకటం ఎలా డాడీ?"

"ఇవి కనీస అవసరాలా? ఇవి లేకపోతే బ్రతకలేవా?" వింతగా చూసేడు జడ్జీగారు కొడుకు వంక.

"ఏంటి డాడీ! మీరన్నీ ఇలాగే మాట్లాడతారు! ఈ మోడరన్ డైస్సులో ఈ మాత్రం వస్తువులు సమకూర్చుకోకపోతే బ్రతకటం ఎలా ?"

"అది కాదురా! కస్టమ్స్ వాళ్ళు గొడవ చేయలేదా? ఇవన్నీ ఎలా తీసుకరానిచ్చేరు ?"

జడ్జిగారి ప్రశ్నకు కిరణ్ పెద్దగా నవ్వేశాడు.

"వాళ్ళెందుకు గొడవ చేస్తారు? రెండు వందల డాలర్లు, ఒక్క స్కాచ్ బోటిల్ తీసుకున్నారు....అంతే. వాళ్ళూ బ్రతకాలి కదా !...."

జడ్జీగారు రెండు క్షణాలపాటు స్తబ్దుగా వుండిపోయారు !

ఆయన మస్తిష్కంలో మెరుపులా కోర్టు హాలు మెదిలింది !

ఒళ్ళమ్ముకు బ్రతికే పువ్వుల నారాయణమ్మ గుర్తుకొచ్చింది !

బూతు పుస్తకాలు అమ్ముకు బ్రతికే ఆదినారాయణ గుర్తుకొచ్చేడు.

వంట సారాఅమ్ముకు బ్రతికే దానయ్య గుర్తుకొచ్చేడు.

బూతు కేసెట్లు చూపించి బ్రతికే చెక్కా- నర్సిములు గుర్తుకొచ్చేడు!

తర్వాత !

లంచం తీసుకుని కొడుకు సామాన్లకు కస్టమ్స్ డ్యూటీ వేయకుండా వదిలేసిన అధికారులు ఊహల్లో మెదిలేరు !

"అప్టరాల్! ఇవన్నీ లేకపోతే బ్రతకటం ఎలా ?" అని ప్రశ్నించే కొడుకు కంటిముందు కనిపించేడు!

నీరసంగా కొడుకు గదిలోంచి బయటకు అడుగువేస్తూ అనుకున్నారు జడ్జీగారు "అందరూ బతకాలి !"

కానీ, కొందరు ఇలా! మరి కొందరలు అలా! అంతే - అందరూ బ్రతకాలి!"